క్లుప్తంగా

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ



మావుళ్లమ్మకు బంగారం సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మావుళ్లమ్మవారికి పట్టణానికి చెందిన అల్లూరి మనోజ్ వర్మ- నాగశృతి దంపతులు 8 గ్రాముల బంగారం సమర్పించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ సిబ్బంది అమ్మవారి ప్రసాదం, రసీదును అందజేశారు. ముందుగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మానవత్వం పరిమళించిన వేళ..



అనాథ వృద్ధురాలికి అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలో అనాథ వృద్ధురాలు చనిపోవడంతో మానవతా సాంఘిక సేవా సంస్థ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించి స్ఫూర్తిగా నిలిచారు. ఈ సందర్భంగా సంస్థ భీమవరం శాఖ అధ్యక్షుడు పూనా రామం, కార్యదర్శి వేమూరి రాంబాబులు మాట్లాడుతూ మానవ సత్ సంబంధాలు రోజురోజుకు తగ్గిపోతున్నాయని, రాబోయే తరానికి తెలియజేప్పాల్సిన బాధ్యత ఈ తరం వారికి ఉందన్నారు. మోక్షదామంలో అంతిమ సంస్కార కార్యక్రమం సాంప్రదాయబద్ధంగా నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో సహకరించిన మానవత సంస్థ చైర్మన్ బుద్ధరాజు వెంకటపతి రాజు, కన్వీనర్ కార్మూరి నరసింహమూర్తి (బాబు), సంఘ సేవకులు, అల్లు శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు.

సామాజిక సేవకు ప్రతిరూపం లయన్స్‌క్లబ్

ఉండి: సామాజిక సేవలకు ప్రతిరూపం లయన్స్‌క్లబ్ అని క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ పీ సుభాష్‌బాబు, క్లబ్ మాజీ గవర్నర్ ఈపూరి సత్యనారాయణ, సీహెచ్ కృష్ణంరాజు తెలిపారు. గురువారం రాత్రి ఉండి లయన్స్‌క్లబ్ ఆడిటోరియంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడు సత్తి బ్రహ్మారెడ్డి, గౌరవాధ్యక్షురాలు వేగేశ్న అనంతలక్ష్మీ, ఉపాధ్యక్షులు ద్వారంపూడి నారాయణరెడ్డి, గాదిరాజు రంగరాజు, కార్యదర్శి ముదునూరి శివరామరాజు, కోశాధికారి పీ నర్సింగరావు, సాగిరాజు సాంబశివరాజు, కూనపరాజు రామరాజు,ముదునూరి విజయ, బొండాడ కేశవరావు, రుద్రరాజు నరసరాజులతో అతిథులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అని నమ్మిన క్లబ్ సభ్యులు సేవా కార్యక్రమాలను మరింతగా ముందుకు తీసుకువెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్నెగంటి రూత్‌కళ, కలిదిండి సీతారామరాజు, కాగిత మహంకాళి, గాదిరాజు వెంకటేశ్వరరాజు, రాము పాల్గొన్నారు.

వ్యక్తిని గాయపరచిన ఘటనపై కేసు నమోదు

ఉండి: ఒక వ్యక్తిని కొట్టి గాయపరచిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి నిమ్మలపేటకు చెందిన వెన్ని సాయివినోద్ కుటుంబానికి, బొబ్బాది సత్యనారాయణ కుటుంబానికి సరిహద్దు తగాదాలు ఉన్నాయి. ఈ కారణంగా ఈ నెల 9వ తేదీ మంగళవారం బొబ్బాది సత్యనారాయణ, అతని కుటుంబ సభ్యులు మరోసారి గొడవ పడి సాయివినోద్‌పై సత్యనారాయణ కుటుంబ సభ్యులు కర్రతో దాడి చేసి గాయ పరిచారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపారు.

తల్లికి వందనంలో నిబంధనల మెలిక

- తల్లికి వందనం ఒక్కరికే అంటూ ఇచ్చిన జీఓపై మహిళల మండిపాటు
- అధికారంలోకి వచ్చాక మాట తప్పడంపై ఆగ్రహం

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మహిళలకి తొలి షాక్ తగిలింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేల చొప్పున తల్లికి వందనం అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక మాట తప్పారు. కుటుంబానికి ఒక్కరికే తల్లికి వందనం అమలు చేస్తామని జీఓ విడుదల చేయడంపై మహిళలు మండిపడుతున్నారు. ముఖ్యంగా మంత్రి నిమ్మల రామానాయుడు ఎన్నికల ప్రచారంలో భాగంగా చెప్పిన మాటలను యువత సోషల్ మీడియాలో షేర్ చేస్తూ కూటమి ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తున్నారు. అలాగే తల్లికి వందనం ఎప్పటి నుంచి అమలు చేస్తారని ప్రశ్నిస్తున్నారు.

– పాలకోడేరు, ఉండి, ఆకివీడు



తరగతి గదిలో చదువుకుంటున్న విద్యార్థినులు (ఫైల్)

నిరాశే మిగిలిందా..?



అమ్మ ఒడి పథకం పేరు మార్చి, తల్లికి వందనంఅన్నారు. ఇంట్లో చదువుకునే బిడ్డలందరికీ రూ.15 వేలు ఇస్తామని చెప్పారు. ఇప్పుడు ఒక బిడ్డ కే ఇస్తామనడం బాధాకరంగా ఉంది. నాకు ఇద్దరు పిల్లలు. జగనన్న ప్రభుత్వంలో ఒకరికి అమ్మ ఒడి వచ్చేది. ఇప్పుడు ఇద్దరికి వస్తుందని ఆశ పడ్డాను. నిరాశే మిగిలింది.

– దావులూరి వనిత, సిద్ధాపురం, ఆకివీడు మండలం

మాట మార్చితే ఎలా..?



తల్లికి వందనం ఇంట్లో ఎంత మంది వుంటే అంత మందికి ఇస్తామని చంద్రబాబు ఎన్నికల్లో వాగ్దానం చేశారు. ఇప్పుడేమో ఒక్కరికే అంటే ఎలా.? జగనన్న అమ్మ ఒడి పేరుతో ఇచ్చే పథకాన్ని పేరు మార్చి తల్లికి వందనం అన్నారు. ఇప్పుడు కాదంటే ఎలా కుదురుతుంది.

– చిగురుపాటి జయంతి, మోగల్లు, పాలకోడేరు మండలం

అమ్మ పేరుతో అన్యాయమా?



అమ్మకు వందనం అని పేరు పెట్టిన పథకానికి ఆదిలోనే అన్యాయం చేయడం చాలా పాపం. అమ్మ పేరు పెట్టిన పథకం ద్వారా ప్రతీ సంవత్సరం ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇస్తానని హామీ ఇచ్చి ఇప్పుడు కుదరదంటే ఎలా ముఖ్యమంత్రి గారూ...ఎన్నికల్లో మీరు చేసిన వాగ్దానం ఒక్కసారి గుర్తు తెచ్చుకొని ప్రతీ ఒక్కరికీ పథకం వర్తించేలా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా స్పందించి పథకాన్ని అందించాలి.

– రెడ్డి కనకదుర్గ, ఉణుదుర్రు, ఉండి మండలం

ట్రిపుల్ ఐటీలో రాయకుదురు విద్యార్థినుల ప్రతిభ



కవురు తేజస్వి లహరి



కోడి అపర్ణ



కవురు తేజస్వి లహరి



కోడి అపర్ణ

వీరవాసరం: మండలం రాయకుదురు గ్రామంలో గల జిల్లా పరిషత్ హైస్కూల్ నందు పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులు నలుగురు ట్రిపుల్ ఐ.టి.నందు సీట్లు సాధించినట్లు ఎంఈఓ శ్రీమన్నారాయణ తెలిపారు. వారిలో జక్కంశెట్టి రిబ్కా న్యూజివీడులో, పంజా బాల శ్రీలక్ష్మి, కోడి అపర్ణ, కవురు తేజస్వి లహరి ఒంగోలు నందు సీట్లు సాధించారు. వీరిని పేరెంట్ కమిటీ చైర్మన్ గుబ్బల సత్యనారాయణ, సర్పంచ్ గెడ్డం భారతి, ఎంపీటీసీలు అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, కడలి నెహ్రూ, ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని, జెడ్పీటీసీ సభ్యులు గుండా జయప్రకాశ్ నాయుడు, ప్రధానోపాధ్యాయులు కానుకొలను శ్రీనివాసరావు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు అభినందించారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన ఘనత ఈయూదే



ఆర్టీసీ డిపో గ్యారేజ్ వద్ద మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

భీమవరం: ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజ్ వద్ద ఎంప్లాయిస్ యూనియన్ కార్యకర్తలు ఘనంగా గురువారం నిర్వహించారు. ముందుగా యూనియన్ కార్యాలయం వద్ద రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వి. రావు యూనియన్ జండా ఆవిష్కరించారు. అనంతరం డిపో వద్ద జరిగిన గేట్ మీటింగ్లో ఎస్వీరావు, యూనియన్ రీజినల్ సెక్రటరీ అల్లం సత్య నారాయణ, రిటైర్డ్ యూనియన్ నాయకులు ఎస్ఎస్ రావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్ మాట్లాడుతూ 1952వ సంవత్సరంలో ఆవిర్భవించిన ఎంప్లాయిస్ యూనియన్ నాటి నుంచి నేటి వరకు కార్మిక పక్షపాతిగా ఎనలేని ఉద్యమలు పోరాటాలు చేసి కార్మికుల మనషుల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. కార్యక్రమంలో జోనల్ నాయకులు ఎంఆర్‌పీ రాజు, బి అరుణ ,కే నాగరాజు, జి ఆర్ కే రాజు ,జి శ్రీనివాస్, డిపో సెక్రటరీ డీవీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించాలి

భీమవరం: ప్రతిభకు పేదరికం అడ్డు కాదని, ఆర్థిక లేమితో ఉన్నత విద్యకు వెళ్లలేని ప్రతిభావంతులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ప్రతిభ కలిగిన ఇంజనీరింగ్ విద్యార్థికి ఎమ్మెల్యే అంజిబాబు కార్యాలయంలో దాతల సహకారంతో రూ 50 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ పేదరికంతో ఉన్నత విద్యకు వెళ్లలేని విద్యార్థులు ఎవరైనా ఉంటే తమ దృష్టికి తీసుకుని వస్తే వారికి సహకారం అందిస్తామని అన్నారు. దాతలందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.మధు, కోళ్ల నాగేశ్వరరావు, కోళ్ల నాగబాబు, రాయలం శివకృష్ణ, గంటా త్రిమూర్తులు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణకు అవగాహన తప్పనిసరి



పట్టణంలో చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: జనాభా నియంత్రణకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆ దిశగా వైద్య ఆరోగ్య అధికారులు కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు అన్నారు. గురువారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవ సందర్భంగా పట్టణంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మన దేశం ఒకటని అన్నారు. విపరీతంగా జనాభా పెరుగుదల వలన సహజ వనరులు అంతరించి అనర్థాలకు దారితీస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ డి. ఉమామహేశ్వరరావు, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి బి .సుజాత రాణి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ డి. సుబ్బలక్ష్మి, జిల్లా గణాంక అధికారి ప్రసాద్, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, భీమవరం మదర్ నర్సింగ్ స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సౌర విద్యుత్ పైనే ప్రపంచం దృష్టి



సోలార్ ఎనర్జీపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఇందిరా దత్

భీమవరం: సౌర విద్యుత్ పైనే ప్రపంచం దృష్టి ఉందని, 2024 నాటికి భారతదేశంలో 5.8 శాతం సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెరిగిందని ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ వీఎల్ ఇందిరా దత్ అన్నారు. భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఓఆర్ బి ఎనార్జీ, ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో సోలార్ ఎనార్జీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా దత్ మాట్లాడుతూ ఇప్పటికే పెద్ద హోటళ్లు, హాస్పిటళ్లు వంటివి సోలార్ ప్యానల్స్ పెట్టుకుంటున్నాయని, ఇది ప్రపంచంలో మన స్థానాన్ని బాగా మెరుగుపరచిందన్నారు. 2024 ఏకంగా ప్రపంచంలోనే మూడో అతి పెద్ద సౌర విద్యుత్ జనరేటర్‌గా అవతరించిందని, వేగవంతమైన సౌర విద్యుత్ విస్తరణలో జపాన్ ను అధిగమించిందన్నారు.ఈ కార్యక్రమంలో కో చైర్మన్ కే శ్రీనివాసరావు, పీ వెంకట్, ఓఆర్ బి ఎనార్జీ పీ కృష్ణ వంశీ, చెరుకువాడ రంగసాయి, అరసవల్లి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

ఉండి: స్థానిక ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణ రాజు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ జుత్తుగ నాగరాజు సంయుక్తంగా గురువారం ఎన్నార్పీ అగ్రహారంలో పర్యటించారు. గ్రామంలోని చెన్నమల్లేశ్వర స్వామి ఆలయానికి వెళ్లి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో గత ప్రభుత్వంలో నిర్మాణం పూర్తి చేసుకున్న హెల్త్ సబ్ సెంటర్ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

16న వాహనాల బహిరంగ వేలం

ఆకివీడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎక్సైజ్) కార్యాలయంలో ఉన్న మూడు వాహనాలను ఈ నెల 16న వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ ఎస్ఈబీ సీఐ కె.కాత్యాయని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్రమ మద్యం తరలిస్తుండగా పట్టుకున్న రెండు యాక్టివా స్కూటీలు, బజాజ్ పల్సర్ వాహనాలను పబ్లిక్ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు తగిన డిపాజిట్ చెల్లించి, ఆధార్, పాన్‌కార్డుతో హాజరయ్యి వేలం పాడుకున్న తరువాత వేలం ధరకు 18 శాతం జీఎస్టీతో మొత్తం సొమ్ము చెల్లించాలని పేర్కొన్నారు.

అధిక జనాభాను అరికట్టాలి

ఆకివీడు: అధిక జనాభా అన్నింటికీ అనర్థమేనని, జనాభా నియంత్రణకు ప్రజలు సహకరించాలని వైద్యులు ఎం.రాజేష్, బీ.రాజ శేఖర్ పిలుపునిచ్చారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం పెదకాపవరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న జనాభాతో పలు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ప్రతీ కుటుంబంలో ఒకరు లేక ఇద్దరు పిల్లలతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్లు, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పాలకోడేరులో...

పాలకోడేరు: తల్లి బిడ్డల సంరక్షణ కోసం జాగ్రత్తలు పాటించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చినమిల్లి రంగమ నాయుడు తెలిపారు. పాలకోడేరులో ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వివాహ వయసు వచ్చిన తర్వాత వివాహం చేయాలని అప్పుడే తల్లి బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం, ఆరోగ్యం కోసం ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టిందని వాటన్నింటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలకు వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. వైద్యాధికారి స్వర్ణ నిరంజని, సీహెచ్ఓ సత్యనారాయణ, సూపర్వైజర్లు శంకర్, అమ్మాజీ, పాల్గొన్నారు.

మహిళపై దాడి కేసు నమోదు

ఉండి: ఆస్తి తగాదాల కారణంగా కుటుంబ సభ్యులే మహిళపై దాడి చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పెదపుల్లేరు గ్రామానికి చెందిన కాజ శివ పార్వతిని గత మే 5న ఆస్తి తగాదాల కారణంగా ఆమె అత్త, బావ, తోటి కోడలు కలిసి ఆమెపై దాడి చేశారు. దీంతో ఆమె ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందించింది. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు బాధితురాలి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై ఎ.సూర్యనారాయణ తెలిపారు.

ఆంధ్రుల హక్కును కాలరాస్తున్నారు

ఆకివీడు: ఆంధ్రుల హక్కును కాలరాస్తూ, విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేసేందుకు కేంద్రం అన్ని విధాలా ప్రయత్నిస్తోందని సీపీఎం ఆందోళన వ్యక్తం చేసింది. స్థానిక వైఎస్సార్ సెంటర్‌లో గురువారం నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు జెఎన్వీ.గోపాలన్ మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ కోసం ప్రాణత్యాగాలు చేసి, ఎంతో మంది అమరులై సాధించుకున్నామన్నారు. కేంద్రంలోని బీజేపీకి సహకరిస్తున్న కూటమి విశాఖ ఉక్కు ప్రైవేట్ పరం చేయడాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. దక్షిణ భారతంలో విశాఖ ఉక్కుకు ఎంతో పేరుందన్నారు. కార్యక్రమంలో కె.తవిటినాయుడు, సందక ఉదయ కుమారి, బి.రాంబాబు, బి.వర్మ, పాల్గొన్నారు.

13న భీమవరంలో విదేశీ విద్యపై అవగాహన సదస్సు

భీమవరం : ఈనెల 13వ తేదీన భీమవరం ఆనంద పంక్షన్ హాల్లో వోక్స్ ఓవర్సీస్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్, మెడిసిన్ విదేశీ విద్యపై (ఇంటర్నేషనల్ ఎడ్యుకేషనల్ పేర్) ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు వోక్స్ ఓవర్సీస్ కార్పొరేట్ రిలేషన్షిప్ మేనేజర్ ఎస్ఎం షరీఫ్ తెలిపారు. స్థానిక హోటల్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు మారుతున్న విద్యా విధానంలో విద్యార్థులు విదేశీ విద్యపై ఎక్కువ మక్కువ చూపిస్తున్నారని, ఒకప్పుడు విదేశీ విద్య కొందరికి పరిమితమైందని, నేడు పేద మధ్య తరగతి విద్యార్థులకు విదేశీ విద్య అందుబాటులోకి వచ్చిందన్నారు. అతి తక్కువ ఖర్చుతో విదేశాల్లో ఇంజనీరింగ్ విద్యార్థులకు ఏంఎస్ చేయడానికి యుఎస్ఏ, యుకే, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ అన్ని యూరోపియన్ కంట్రీస్ లో విద్యతోపాటు ఉపాధి అవకాశాలు, ఎంబీబీఎస్ తోపాటు పీజీ ఉచితంగా యుఎస్ఏ, నెదర్లాండ్, రష్యా, ఇటలీలో చదువుకునే అవకాశాలున్నాయన్నారు. ఈనెల 13న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భీమవరంలో విదేశీ విద్యపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవా లని కోరారు. మరిన్ని వివరాల కోసం 99661 66659, 90 325 25044, 97049 54807 లకు సంప్రదించాలని కోరారు.

హాస్టళ్లలో అధికారుల తనిఖీ



బాలుర హాస్టల్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి ఎం.వేణుగోపాల్

ఆకివీడు: హాస్టళ్లలో మౌలిక సదుపాయల ఆవశ్యకతపై గురువారం మండల ప్రత్యేక అధికారి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి ఎం.వేణుగోపాల్ పరిశీలన చేశారు. స్థానిక బాలుర, బాలికల హాస్టల్స్ భవనాలను పరిశీలించారు. బాలుర హాస్టల్‌లో బాత్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఫ్యాన్లు, దోమ తెరలు, ఆర్వో ప్లాంట్, గ్రైండర్ వంటి సదుపాయాలు కల్పించాల్సి ఉందని చెప్పారు. హాస్టల్ భవనం లోతట్టు ప్రాంతంలో ఉందని, పూడిక పనులు చేపట్టాల్సి ఉందన్నారు. వర్షపు నీరు నిలబడిపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకువచ్చారు. బాలికల హాస్టల్ భవనం శ్లాబ్ కూలిపోవడానికి సిద్ధంగా ఉందన్నారు. ఈ హాస్టల్‌ను భీమవరం తరలించారని, శ్లాబ్‌ను తొలగించి, కొత్త భవనాన్ని నిర్మించాలని కోరారు. విద్యార్థులకు అందుతున్న ఆహారం, ఇతర వసతులపై ఆయన పరిశీలించారు. ప్రత్యేక అధికారి వెంట ఏపీఎం నాయుడు పాల్గొన్నారు.

ఆకివీడులో డయేరియా

ఆకివీడు: స్థానికంగా డయేరియా(అతిసార)తో బాధపడుతు పలువురు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్ని ఆశ్రయిస్తున్నారు. గత పదిహేను రోజులుగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి డయేరియాతో వెళ్తున్న వారి సంఖ్య రోజురోజుకూ కొనసాగుతుండగా, ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు. తాగునీటి సమస్యతో బాధపడుతూ ఆస్పత్రికి వస్తున్నవారి రోగుల సంఖ్య అధికంగా ఉందని వైద్యురాలు అజ్మీనా నస్రీన్ చెప్పారు. గురువారం డయేరియాతో బాధపడుతూ ఒక వ్యక్తి, టైఫాయిడ్‌తో ఒక వ్యక్తి ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నారన్నారు. వ్యాధి తీవ్రతను బట్టి ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్‌గా తీసుకుని వైద్యం అందిస్తున్నామన్నారు. 2,3 విరోచనాలతో వచ్చే వారికి చికిత్స చేసి, మందులు ఇచ్చి పంపించి వేస్తున్నట్లు తెలిపారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాల్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె సూచించారు. దోమల నివారణకు పాగింగ్, స్ప్రేయింగ్ చేయించాలని సూచించారు.

పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్ప విద్యుత్ ఉప కేంద్ర పరిధిలో శుక్రవారం 11 కేవీ విద్యుత్ లైన్లపై చెట్లు, కొమ్మలు తొలగించుట, వార్షిక మరమ్మతల నిమిత్తం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ గురువారం తెలిపారు. గూట్లపాడు, కొత్తపూసలమర్రు, దొంగపిండి గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకోడేరు: శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకు 33/11 కేవీ మోగల్లు, విస్సాకోడేరు పైపుల చెరువు సబ్ స్టేషన్ల మరమ్మతులు నిర్వహిస్తారు. దీంతో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు భీమవరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. పాలకోడేరు, కుముదవల్లి గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.